క్లుప్తంగా

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఎంపీసీ, ఒకేషనల్ సీజీఏ, ఈసీటీ, సీఎస్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే రోజు ఉ.10 గంటల నుంచి 12 గంటల వరకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు పదవ తరగతి సర్టిఫికెట్లు, ఒరిజినల్ కులం, ఆదాయం సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఉ.10 నుంచి 12:00 వరకు దరఖాస్తులు స్వీకరించి మధ్యాహ్నం ఎంపికైన విద్యార్థుల లిస్టు తెలియజేసి అడ్మిషన్లు చేసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే, హత్నూరలోని గురుకుల పాఠశాల, కళాశాలలో సీఈసీ గ్రూపులో ఖాళీ ఉన్న సీట్లకు 31న స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు.

మొక్కలు పెంచే బాధ్యత మహిళలదే

మున్సిపల్ కమిషనర్ రవీందర్

జోగిపేట(అందోల్): 100 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం 11, 12వ వార్డుల్లో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ రవీందర్ ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులు, వార్డు ప్రజలకు అందజేశారు. తీసుకున్న మొక్కలను పెంచే బాధ్యత మీరే తీసుకోవాలన్నారు. మొక్కలు పెంచడంతో పచ్చదనం పెంపొందించి అందరికీ మంచి ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుందన్నారు. రేపటి నుంచి అన్ని వార్డుల్లో ఇంటింటికి మొక్కల పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ భిక్షపతి గౌడ్, వార్డు ఆఫీసర్ ఇంతియాజ్ అలీ, ఇంజనీరింగ్ సెక్షన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, ఆర్పీలు లక్ష్మి, జ్యోతి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అందోల్ స్పెషల్ ఆఫీసర్‌గా రమాదేవి



జోగిపేట(అందోల్): అందోల్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమాదేవి నియమితులయ్యారు. అందోల్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసిన మెప్మా పీడీ గీతా మెదక్ జిల్లా డిప్యూటీ సీఈవోగా బదిలీ కావడంతో రమాదేవిని నియమించారు. మంగళవారం స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి రాజేష్‌కుమార్, ఎంపీఓ సూర్యనారాయణ ఉన్నారు. అనంతరం ఈజీఎస్, ఎంపీపీ కార్యాలయ సిబ్బందితో సమావేశమై మండల అభివృద్ధిపై చర్చించారు.


చెత్త సేకరణపై అవగాహన



పారిశుద్ధ్య కార్మికుడితో మాట్లాడుతున్న కిషన్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. ఆయా వార్డుల్లోని పనులను కమిషనర్ కిషన్ పర్యవేక్షించారు. తడిపొడి చెత్త సేకరణ, స్వచ్ఛ చెత్త ఆటో సేకరణ పద్ధతులను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం వార్డు ఆఫీసర్లు చేపడుతున్న భువన్ యాప్ సర్వే నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు స్థానికులు శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదను నివారించండి



వినతిపత్రం ఇస్తున్న నామరవికిరణ్ తదితరులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో కుక్కలు, పందుల బెడద నివారించాలని స్పెషల్ ఆఫీసర్, ఆర్డీఓ రాంరెడ్డికి బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నామ రవికిరణ్ మాట్లాడుతూ.. పట్టణంలో వీధికుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయని, పిల్లలపై దాడి చేసి స్వైర విహారం చేస్తున్నాయని వాపోయారు. ఇటీవల డ్రీమ్ ఇండియా కాలనీలో బాలికపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిందన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వాపోయారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నరేష్‌రెడ్డి, రాజారమేష్, సందీప్‌రాజ్, జహీర్, అజయ్‌స్వామి తదితరులు ఉన్నారు.



రామచంద్రాపురం(పటాన్‌చెరు): నాగులమ్మ తల్లి ఆలయంలో



నారాయణఖేడ్: పుట్టవద్ద పూజలు చేస్తున్న యువతులు

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

జిల్లా వ్యాప్తంగా మంగళవారం నాగపంచమి పూజలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నాగదేవతల ఆలయాలు, పుట్టల వద్దకు ఉదయం నుంచే బారులు తీరారు. కుటుంబ సమేతంగా నాగదేవతకు పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. అర్ధరాత్రి తిరిగే సమయంలో తమకు ఎలాంటి హాని కలిగించవద్దని నాగదేవతను వేడుకున్నారు. ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.



పట్టణంలో పూజలు చేస్తున్న మహిళలు



జహీరాబాద్ టౌన్: మహీంద్ర కాలనీలో



హత్నూరలో పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎన్‌ఎల్‌ఎం బృందం పర్యటన

కంది(సంగారెడ్డి): కంది మండలంలోని మక్త అల్లూరులో నేషనల్ లెవెల్ మానిటరింగ్ బృందం సభ్యులు సురంజన్ రెడ్డి, సాదిక్ అలీ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలు, పింఛన్ పొందుతున్న లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై వారు చేపడుతున్న కార్యకలాపాలు, రుణాల వినియోగం వంటి అంశాలపై చర్చించారు. గ్రామంలోని వనసర్సరీ, క్రీడా ప్రాంగణం, రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి అనిల్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ దీపక్‌కుమార్, ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ గురుపాదం తదితరులు పాల్గొన్నారు.



ఉపాధిహామీ గురించి తెలుసుకుంటున్న సభ్యులు


నక్షాబాట కోసం ఆందోళన



నక్షాబాట వద్ద బైఠాయించిన తండావాసులు

కంది(సంగారెడ్డి): నక్షాబాట కోసం తండావాసులు ఆందోళనకు దిగారు. పూర్వకాలం నుంచి పొలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన నక్షాబాటను కొందరు ఇటీవల భూములు కొనుగోలు చేసి దారిని కబ్జా చేశారని ఆరోపించారు. తండా శివారులోని సర్వే నంబర్ 312 నుంచి 35 వరకు రైతులు నక్షబాటను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో భూములు కొనుగోలు చేసిన కొందరు సర్వే నంబర్ 34 నుంచి 354 వరకు నక్షాబాటను పూర్తిగా కబ్జా చేయడంతో ముందున్న పొలాలకు వెళ్లేందుకు రైతులకు దారి లేకుండా పోయింది. దీంతో తండావాసులంతా కలిసి నక్షాబాట వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత రెండేళ్లుగా నక్షాబాటను కబ్జా నుంచి తొలగించాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో వడ్డెనగూడ తండావాసులతో పాటు చుట్టుపక్కల రైతులు పాల్గొన్నారు.

పత్తిలో సమతుల్యంగా ఎరువులు వాడాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ భిక్షపతి

ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్: పత్తిసాగులో రైతులు ఎరువులను సమతుల్యంగా వాడినప్పుడే మంచి ఫలితాలుంటాయని ఏడీఏ భిక్షపతి అన్నారు. మంగళవారం కోహీర్ మండల కేంద్రంలో పత్తి పంటలను క్షేత్ర సందర్శనలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలిచ్చారు. అనంతరం జరిగిన సమావేశంలో భిక్షపతి మాట్లాడుతూ.. పత్తి పంటకు ఎరువులను సమతుల్యంగా వాడుకోవాలన్నారు. పైపోటుగా నత్రజని, పొటాష్ ఎరువులను కలిపి వేసుకోవాలన్నారు. పైపోటుగా ఎరువులు వేయలేని పరిస్థితుల్లో బెట్ట పరిస్థితులు లేదా అధిక తేమ ఉన్నప్పుడు నానోయూరియాను పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం పత్తి పంట శాకీయ దశలో ఉందన్నారు. 40–45 రోజుల దశలో ఉన్న పత్తి పంటకు రసం పీల్చే పురుగులు ఆశించకుండా ముందు జాగ్రత్త చర్యగా పసుపు, తెలుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 10 నుంచి 15 ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పచ్చదోమ, తామర పురుగు, పేనుబంక లాంటివి ఆశించినప్పుడు వేప నూనె 1500 పీపీఎం లీటరు నీటికి 5ఎంఎల్ చొప్పున లేదా పిప్రోనిల్, ఎసిపేట్, కాన్ఫిడార్‌లో ఏదో ఒక పిచికారీ చేసుకోవాలన్నారు. క్షేత్ర సందర్శనలో ఏఈఓ శ్రీనివాస్‌తో పాటు రైతులు జలీల్, అన్వాన్ జావిద్, మన్నె క్రిష్ణ, వెంకటేశ్వర్లు, నర్సింహులు, విఠల్, రాచయ్య పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శిగా చిరంజీవి



నారాయణఖేడ్: ఏఐటీయూసీ సంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శిగా నారాయణఖేడ్‌కు చెందిన సాతిని చిరంజీవిని నియమించారు. జిల్లా నాలుగవ మహాసభల సందర్భంగా ఈ నియామకం చేపట్టారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, కార్యదర్శి నర్సింహులు, సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, డివిజన్ కార్యదర్శి ఆనంద్, అశోక్, దత్తురెడ్డి, ఏఐటీయూసీ జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం నల్లవాగు గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు గురువారం స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నామని ప్రిన్సిపాల్ తిరుపతయ్య మంగళవారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 30, బైపిసీలో 19 సీట్లకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఉ.10 గంటలకు కళాశాలలో ఒర్జినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలని కోరారు.

ఎస్సీ గురుకులంలో..

జహీరాబాద్ టౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల న్యాల్‌కల్(దిగ్వాల్)లో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రాములు ప్రకటనలో తెలిపారు. గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీ, ఎలక్ట్రికల్ టెక్నీషయన్ గ్రూపులకు సంబంధించి మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. 31న ఉదయం 9 గంటల నుంచి మ.1 గంట వరకు దరఖాస్తుల స్వీకరణ, అదే రోజు రెండు గంటల తరువాత మెరిట్ లిస్టు ప్రకటించి తక్షణమే ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

రేపు స్పాట్ కౌన్సెలింగ్

నారాయణఖేడ్: ఖేడ్ సాంఘిక సంక్షేమ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ప్రవేశాలకు కళాశాలలో ఈనెల 31న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ లింగారెడ్డి తెలిపారు. ఉ.9 నుంచి మ.1 గంట వరకు దరఖాస్తులను స్వీకరించి మ. 2 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థులు సంగారెడ్డి ప్రాంతానికి చెందినవారై ఉండి 2024 జనవరి 1వ తేదీ తరువాత మీసేవ ద్వారా జారీ చేసిన కుల, ఆదాయ, పుట్టిన తేదీ ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు పదో తరగతి ఒరిజినల్ మెమోతో హాజరు కావాలన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.50 లక్షలకు మించి ఉండరాదన్నారు.

'సిగాచి' యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి

సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు

పటాన్‌చెరు టౌన్: సిగాచి పరిశ్రమ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలని సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. దాదాపు నెల రోజులు కావస్తున్నా ఒక్క కుటుంబానికి కూడా పూర్తిస్థాయిలో నష్టం పరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. బాధిత కుటుంబాలకు కోటి నష్టపరిహారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కంగ్టి సీఐగా వెంకట్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి, కల్హేర్, సిర్గాపూర్ సీఐగా దమ్మ వెంకట్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కంగ్టి సీఐగా వెంకట్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా ఎస్పీ పరితోష్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిర్గాపూర్ ఎస్సైగా పనిచేస్తున్న వెంకట్‌రెడ్డి రెండు నెలల క్రితం సీఐగా పదోన్నతి పొందారు. కంగ్టిలో ఇప్పటి వరకు పనిచేసిన సీఐ చంద్రశేఖర్‌రెడ్డి మల్టీజోన్-2కు బదిలీ అయ్యారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంతత

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మనసుకు ప్రశాంతత లభిస్తుందని.. ప్రతి ఏడాది పటాన్‌చెరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని మహంకాళి దేవాలయంలో వేంకటేశ్వర భక్త బృందం నిర్వాహకుడు రాజు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే , కార్పొరేటర్లు కుమార్‌యాదవ్, పుష్ప, నీలం మధు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కాటా సుధా తదితరులు పాల్గొని భక్త బృందం సభ్యులను సన్మానించారు. అనంతరం తిరుమల పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీసాల రాజు మాట్లాడుతూ.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తిరుమల తిరుపతి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పాదయాత్ర 16 రోజుల పాటు సాగుతుందన్నారు. కార్యక్రమంలో భాస్కర్, శ్రీనివాస్ ముదిరాజ్, మహేశ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు



రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు టౌన్: అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే నూతన రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చించి రేషన్ దుకాణాల ద్వారా పేద మధ్యతరగతి ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు. డబ్బుల కోసం రేషన్ బియ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించొద్దని విజ్ఞప్తి చేశారు. అలా విక్రయిస్తే శాశ్వత ప్రాతిపదికన రేషన్ కార్డులను రద్దు చేస్తామని హెచ్చరించారు. చిన్న చిన్న కారణాలతో రేషన్ కార్డుల దరఖాస్తులను తిరస్కరించవద్దని అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో నియోజకవర్గ వ్యాప్తంగా 2096 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు అందించామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి స్వరూప, నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, కార్పొరేటర్ పుష్పనగేష్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూసారం మెరుగు



జీలుగ పంటను పరిశీలిస్తున్న ఏఓ లావణ్య తదితరులు

జహీరాబాద్ టౌన్: పచ్చిరొట్టను పూత దశలోనే నేలలో కలియదున్నడంతో భూసారం పెరుగుతుందని వ్యవసాయ అధికారిణి లావణ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రంజోల్ తదితర గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న జనుము, జీలుగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చిరొట్ట నేలలో కలియదున్నిన పంట కుళ్లేటప్పుడు అమ్లాలు విడుదలవుతాయన్నారు. దీంతో నేలలలో మొక్కలకు భాస్వరం, పోటాష్ అందడమే కాక గాలిలోని నత్రజని నేలలో స్థిరీకరిస్తుందని చెప్పారు. సూక్ష్మపోషకాలు మొక్కలకు లభ్యమై పంట ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయి. పచ్చిరొట్టను భూమిలో కలియదున్నడం వల్ల నేల గుల్ల బారడమే కాకుండా పంటకు ఎరువు మాదిరిగా పనిచేస్తుందన్నారు. కలుపు మొక్కల నివారణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. ఆమె వెంట ఏఈఓలు, ప్రదీప్ కుమార్, వీరేందర్ రైతులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభం



సమావేశంలో మాట్లాడుతున్న నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో వరిపంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని ఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. మంగళవారం సిర్గాపూర్ రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ఆసక్తి చూపాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సబ్సిడీ, యాజమాన్య పద్ధతులపై వివరించారు. ఆసక్తి గల రైతులు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అనంతరం పత్తి, సోయాబీన్ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ హరికృష్ణ, ఏఈఓలు భాస్కర్, శివకుమార్, సమతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రావు, జయరాజ్ పాల్గొన్నారు.

12వ వార్డులో కమిషనర్ పర్యటన



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

సంగారెడ్డి: పట్టణంలోని 12వ వార్డులో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. వార్డులోని ప్రగతినగర్, ద్వారకనగర్ , బృందావనం కాలనీలో పర్యటించి కాలనీలోని రోడ్లను పరిశీలించారు. బృందావనం కాలనీ నుంచి ధ్రువ హాస్పిటల్ వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రగతి నగర్, ద్వారక నగర్‌కాలనీ రోడ్లు గుంతమయంగా మారడంతో మాజీ కౌన్సిలర్ రాజేందర్‌రెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన మున్సిపల్ నుంచి రూ.8 కోట్ల వరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, నిధులు మంజూరు కాగానే మొదటి ప్రాధాన్యతగా ఈ రోడ్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

నిబంధనలు తప్పనిసరి

కల్హేర్(నారాయణఖేడ్): రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు నిబంధనలు పాటించాలని సిర్గాపూర్ ఎస్ఐ మహేశ్ పేర్కొన్నారు. మంగళవారం సిర్గాపూర్ సమీపంలో వాహనాలు తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రాంగ్‌రూట్ ప్రయాణం, తదితర అంశాలపై వివరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ పారిశుద్ధ్య పనుల పరిశీలన

కంగ్టి(నారాయణఖేడ్): కేంద్ర ప్రభుత్వ పథకం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా జిల్లా సభ్యులు మంగళవారం మండలంలోని నాగుర్(కే) గ్రామంలో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం తదితర పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీని వాసులు, ఎంపీఓ సుభాష్, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ పాల్గొన్నారు.

◆ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాస్ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం మండలంలోని హుమ్నాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..ఇంటి నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని అందుకు సంబంధించిన బిల్లులను కూడా సకాలంలో చెల్లించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి క్రిష్టారెడ్డి, గుణవంత్ పటేల్, దయానంద్ ఉన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

నారాయణఖేడ్: సీఎం సహాయనిధి నుంచి ఆస్పత్రి ఖర్చుల కోసం ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటకు చెందిన కొట్టంల సత్యనారాయణకు రూ.60 వేలు, పోశెట్టి అంజయ్యకు రూ.45 వేలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కులను మంగళవారం ఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, మాజీ వైస్ పరశురాం, అభిషేక్ షెట్కార్, ముజమ్మిల్, మల్గొండ, నగేష్ సేట్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

◆ సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నుంచి తిరుమల తిరుపతికి పాదయాత్రగా వెళ్తున్న సీసాల రాజుకు మంగళవారం రామచంద్రాపురం పట్టణంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం పాదయాత్రగా వెళ్తున్న వారిని ఘనంగా సన్మానించారు.

◆ బాధిత కుటుంబాలకు పరామర్శ

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండల బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కార్యకర్తల కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. జిన్నారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నర్సింహారెడ్డి తల్లి సునంద, కార్యకర్త మంగలి శ్రీను మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఉద్యమకారుడు వెంకటేశం గౌడ్ వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం శివనగర్ మాజీ సర్పంచ్ రేఖాకృష్ణ తల్లి అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు.